సాక్షి చిత్తూరు

సోమవారం । 19 । జూన్ । 2023



అద్దాల మండపం..

కాణిపాకంలోని వరసిద్ది వినాయక స్వామి ఆలయంలో నిర్మిస్తున్న అద్దాల మండపం పనులు చురుగ్గా సాగుతున్నాయి. -8లో



చార్జింగ్.. వెయిటింగ్

తిరుపతిలో ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్యకు సరిపడా చార్జింగ్ స్టేషన్లు లేకపోవడంతో ప్రయాణికులు నిరీక్షించాల్సి వస్తోంది. -10లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	37	26
తిరుపతి	38	27
తిరుమల	33	22
గూడూరు	41	29
నగరి	39	27

న్యూస్‌రీల్

కాణిపాకంలో దేవదాయ శాఖ స్థపతి



కాణిపాకం ఆలయ అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న స్థపతి పరమేశ్వరప్ప

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో దాతల సహాయంతో నిర్మిస్తున్న అద్దాల మండపాన్ని దేవదాయ శాఖ స్థపతి పరమేశ్వరప్ప ఆదివారం పరిశీలించారు. మధ్యాహ్నం ఆయన కాణిపాకానికి విచ్చేయగా ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ప్రధాన ఆలయంలో నూతనంగా నిర్మిస్తున్న అద్దాల మండపం, ఆంజనేయ స్వామి ఆలయం, 100 అడుగుల రహదారిలో ఆర్చి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ రంగస్వామి, ఇన్‌స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కథల పోటీలకు ఆహ్వానం

పలమనేరు: మలిశెట్టి సీతారామ్ (ఎమ్మెస్సార్) జ్ఞాపకార్థం ఏటా నిర్వహించే జాతీయ స్థాయి కథల పోటీలకు రచనలు ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకులు ఎం.శ్యామ్‌ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో ఎంపికైన కథలను కథాప్రపంచం 2023 పుస్తకంలో ప్రచురించడంతో పాటు మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వాటికి నగదు బహుమతులు అందించనున్నట్లు అందులో తెలిపారు. కథల నిడివి పీడీఎఫ్‌లో ఐదుపేజీలకు మించకుండా ఉండాలని రచయిత చిరునామాతో జూలై 15లోపు పలమనేరు రచయితల సంఘం, డోర్‌నెం:6/219, గుడియాత్తం రోడ్డు, పలమనేరు అనే చిరునామాకు పంపాలని సూచించారు.

పరాశరేశ్వరుని బ్రహ్మోత్సవాలకు శ్రీకారం



తిరుచ్చి వాహనంపై ఊరేగుతున్న గణపతి

నారాయణవనం: టీటీడీ అనుబంధ ఆలయమైన చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆదివారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. సోమవారం ఉదయం ధ్వజారోహణం నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. పదిరోజులపాటు సాగనున్న ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ ఉదయం 10 గంటలకు స్నపన తిరుమంజనం, సాయంత్రం7 గంటలకు వాహన సేవలను జరిపించనున్నారు. ఉత్సవాల అంకురార్పణలో భాగంగా ఆదివారం ఉదయం స్వామివారికి నిత్యపూజలు నిర్వహించారు. సాయంత్రం యాగశాలలో గణపతి హోమం, వాస్తు, శాంతి పూజలను చేపట్టారు. అనంతరం వేదమంత్రోచ్చారణల నడుమ అంకురార్పణ చేశారు. అనంతరం గణపతి ఉత్సవమూర్తిని తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చి పుర వీధుల్లో ఊరేగించారు. ఆలయ అధికారి నాగరాజు మాట్లాడుతూ సోమవారం ఉదయం 7.30 గంటలకు నందీశ్వరుని చిత్రపటమున్న వస్త్రాన్ని ధ్వజస్తంభానికి అధిరోహింప చేయడంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని వెల్లడించారు. సాయంత్రం పరాశరేశ్వరస్వామివారు చంద్రప్రభ వాహనాన్ని అధిష్ఠించి పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించనున్నట్లు తెలిపారు. 26వ తేదీన నిర్వహించనున్న ఆర్జిత కల్యాణోత్సవంలో రూ.500 చెల్లించి దంపతులు పాల్గొనవచ్చని వివరించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు వేయించారు.

అరణియార్ వద్ద అభివృద్ధి పనులు

పిచ్చాటూరు : మండలంలోని అరణియార్ జలాశయం వద్ద అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చొరవతో అరణియార్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు రూ.1.86 కోట్లను తుడా మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఈ నిధులతో వ్యూటవర్, బోటింగ్ జెట్టీ, 3 బోట్లు, చిల్డ్రన్స్ పార్కు, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. ఈ పనులు పూర్తయితే అరణియార్ పూర్వవైభవం సంతరించుకుంటుందని, పర్యాటక కేంద్రంగా మారుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మండలానికి ఒక ఎంఈవో ఉండడం వల్ల అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ కార్యకలాపాలను ఒకరే చేయలేని పరిస్థితి. ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్య వల్ల ఎన్నో సంవత్సరాలుగా ప్రభుత్వ యాజమాన్యం, జిల్లా పరిషత్ యాజమాన్యంలో ఉద్యోగోన్నతులు నిలిచిపోయాయి. చాలా మంది సీనియారిటీ ఉన్నప్పటికీ ఎంఈవోలుగా ఉద్యోగోన్నతి పొందలేకపోయారు. ఈ సమస్యను గుర్తించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంఈవో–2 పేరుతో కొత్త పోస్టులను సృష్టించింది. వైఎస్సార్‌సీపీ సర్కారు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యాభివృద్ధికి విశేష కృషి చేస్తోంది. విద్యారంగంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారు. ప్రస్తుతం విద్యాశాఖలో ఎంఈవో–2 పోస్టులను కొత్తగా సృష్టించడంతో ఉద్యోగోన్నతి పొందిన హెచ్‌ఎంలు, ప్రస్తుతం ఉన్న ఎంఈవోలు సంబరాలు చేసుకుంటున్నారు.

తగ్గిన భారం.. అధికారుల సంబరం



కౌన్సెలింగ్‌లో డీఈవోకు ఆప్షన్ ఫారం అందజేస్తున్న ఎంఈవో

- మండలానికి ఇక ఇద్దరు ఎంఈవోలు
- ఒకరు అకడమిక్, మరొకరు నాన్‌అకడమిక్
- ఏళ్ల నాటి సమస్యకు వైఎస్సార్‌సీపీ సర్కారు పరిష్కారం



ఎంఈవో–2 కౌన్సెలింగ్‌కు హాజరైన పలు మండలాల్లో పనిచేసే హెచ్‌ఎంలు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 66 మండలాల పరిధిలో పనిచేస్తున్న సీనియర్ హెచ్‌ఎంలకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎంఈవో–2 పోస్టులకు చిత్తూరు డీఈవో కార్యాలయంలో పకడ్బందీగా కౌన్సెలింగ్ జరిపారు. ఈ ప్రక్రియను చిత్తూరు డీఈవో విజయేంద్రరావు, డీవైఈవో చంద్రశేఖర్, ఏడీ వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 66 మండలాల నుంచి సీనియర్ హెచ్‌ఎంలు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. దీంతో డీఈవో కార్యాలయంలో సందడి వాతావరణం నెలకొంది. చాలా ఏళ్ల తర్వాత హెచ్‌ఎం కేడర్ నుంచి ఎంఈవో కేడర్‌కు ఉద్యోగోన్నతులు నిర్వహించడంతో సంతోషం వ్యక్తం చేశారు. మొదటి రోజు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 38 మంది ఎంఈవో–2 ఉద్యోగోన్నతులకు అంగీకారం తెలిపారు. మిగిలిన 28 మండలాలకు సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. వీరిలో ఒక ఎంఈవోకు విద్యాసంబంధిత వ్యవహారాలు (అకడమిక్), మరో ఎంఈవోకు విద్యారహిత వ్యవహారాల(నాన్ అకడమిక్) పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించనున్నట్లు అధికారులు తెలిపారు.

20 ఏళ్ల సమస్యకు పరిష్కారం

గత 20 సంవత్సరాలుగా కొత్త ఎంఈవో పోస్టులను సృష్టించాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. అయితే వారి సమస్యను గత టీడీపీ పాలకులు ఏ మాత్రం పట్టించుకోని దుస్థితి. పలుమార్లు వారి సమస్యను గత టీడీపీ సర్కారు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. చాలా మంది ఎంఈవో కలను నెరవేర్చుకోలేక ఉద్యోగ విరమణ పొందారు. ఈ సమస్యకు ప్రస్తుతం జగనన్న సర్కారు పరిష్కారం చూపడంతో ఎంఈవో–2గా నియమితులైన వారు ఆనందంలో మునిగితేలుతున్నారు.

మంచి నిర్ణయం



ప్రభుత్వం ఎంఈవో–2 పోస్టులను ఏర్పాటు చేయడం మంచి నిర్ణయం. ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. కౌన్సెలింగ్‌లో బంగారుపాళెం ఎంఈవో–2గా నియమించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంఈవో–2 కేడర్‌లో అకడమిక్ వ్యవహారాలు పర్యవేక్షిస్తాం. దీని వల్ల ఎంఈవోలకు పనిభారం తగ్గింది. పర్యవేక్షణ సమయం దొరికింది.

– రమేష్‌బాబు, ఎంఈవో–2, బంగారుపాళెం

ఆకాంక్ష నెరవేరింది



చాలా రోజుల ఆకాంక్ష నెరవేరింది. కౌన్సెలింగ్‌లో పాకాల మండలం ఎంఈవో–2గా కోరుకున్నాను. సర్వీస్ రూల్స్ సమస్య వల్ల హెచ్‌ఎం కేడర్ నుంచి ఎంఈవోలుగా ఉద్యోగోన్నతులు పెండింగ్‌లో పడ్డాయి. ఈ సమస్యను ప్రస్తుతం ప్రభుత్వం పరిష్కరించడం హర్షణీయం. ఈ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం.

– లింగయ్య, ఎంఈవో–2, పాకాల

సమన్వయంతో పనిచేస్తాం



ఎంఈవో 1, 2లు సమన్వయంతో పనిచేస్తాం. ఎంఈవో–2 పోస్టులు కేటాయించడం శుభ పరిణామం. కౌన్సెలింగ్‌లో గుడిపాల మండలం కోరుకున్నాను. ఆ మండలంలో నిత్యం పాఠశాలలను పర్యవేక్షించి నా వంతు విద్యాప్రమాణాల పెంపునకు కృషి చేస్తాను. సుమారు 20 ఏళ్ల సమస్యకు ముఖ్యమంత్రి పరిష్కారం చూపారు.

– గణపతి, ఎంఈవో–2, గుడిపాల

పకడ్బందీగా కౌన్సెలింగ్



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం ఎంఈవో–2 పోస్టులకు పకడ్బందీగా కౌన్సెలింగ్ నిర్వహించాం. సీనియారిటీ జాబితాను ప్రచురించి కౌన్సెలింగ్ నిర్వహించాం. ఉమ్మడి జిల్లాలోని 66 మండలాలకు గాను 38 మంది ఎంఈవో–2 పోస్టులను కోరుకున్నారు. మిగిలిన పోస్టులకు సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నాం. 38 మంది ఎంఈవో–2లు సంబంధిత మండలాల్లో విధుల్లో చేరాలని ఆదేశాలిచ్చాం.

– విజయేంద్రరావు, డీఈవో, చిత్తూరు

24 వరకు ఒంటిపూట బడులు

చిత్తూరు కలెక్టరేట్ : వేసవితాపం దృష్ట్యా ఈ నెల 24 వరకు ఒంటిపూట బడులను పొడిగించినట్లు డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడకూడదని మరోవారం రోజుల పాటు ఒంటిపూట బడులను ప్రభుత్వం కొనసాగించిందన్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు యథాతథంగా ఈ నెల 24 వరకు ఉదయం 7.30 నుంచి 11.30 గంటల వరకు తరగతులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో తరగతుల అనంతరం మెనూ ప్రకారం పిల్లలకు మధ్యాహ్న భోజనం అందించాలని తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఈఓ హెచ్చరించారు.

చురుగ్గా బిల్లుల నమోదు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న తాగునీటి సరఫరా బిల్లుల నమోదు ప్రక్రియ వేగంగా సాగుతోంది. జిల్లా గ్రామీణ నీటి సరఫరాశాఖ పరిధిలో గ్రామాల్లో సరఫరా చేసిన తాగునీటి ట్యాంకర్ల పరంగా పెండింగ్‌లో ఉన్న బిల్లు మొత్తం రూ.43 కోట్లు విడుదలైంది. మొత్తం 12,500 బిల్లులను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు 10 మంది డీఈలు, 30 మంది ఏఈలు, కార్యాలయ, సచివాలయ సిబ్బంది 20 మంది పనిచేస్తున్నారని ఆ శాఖ ఎస్‌ఈ శంకర్‌బాబు తెలిపారు. ఇప్పటి వరకు రూ.13 కోట్లు విలువైన 3,000 బిల్లులు అప్‌లోడ్ చేశామన్నారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ వెల్లడించారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో తెలియజేసి పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే స్పందనకు జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు.

జూడో పోటీలకు రాష్ట్ర జట్ల ఎంపిక



క్రీడాకారులతో టీటీడీ బోర్డ్ మెంబర్ పోకల అశోక్‌కుమార్ తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రెండు రోజులుగా నిర్వహించిన బాలబాలికల జూడో రాష్ట్ర జట్ల ఎంపిక పోటీలు ఆదివారం ముగిశాయి. ప్రతిభ చూపిన క్రీడాకారులను ఎంపిక చేశారు. బాలుర విభాగంలో యువరాజ్, చిన్నా, పుల్లారెడ్డి, విష్ణు, షాహుల్, గోవర్ధన్, వరుణ్‌కుమార్, సాయికిరణ్, బాలికల విభాగంలో సౌమ్యరాణి, పూజిత, వైష్ణవి, మహిత, జ్యోత్స్న, పూజితబాయి, యశోద, హారిక ఎంపికయ్యారు. వీరు జూలై 5నుంచి 10వ తేదీ వరకు కర్ణాటకలో జరిగే జాతీయ స్థాయి జూడో చాంపియన్‌షిప్ పోటీల్లో రాష్ట్రం తరపున పాల్గొననున్నట్లు జూడో సంఘం అధ్యక్షుడు ఆనం రామకిషోర్‌రెడ్డి, కార్యదర్శి బద్దుల శ్రీధర్ తెలిపారు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు టీటీడీ పాలకమండలి సభ్యులు పోకల అశోక్‌కుమార్, డాలర్స్ గ్రూప్ అధినేత దివాకర్‌రెడ్డి, జెన్ అకాడమీ రాజేష్, భానుప్రకాష్‌రెడ్డి, కిరణ్‌కుమార్ అభినందనలు తెలిపారు. జాతీయ స్థాయిలో సత్తాచాటి రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

22న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

చంద్రగిరి(తిరుపతి రూరల్) : శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల22 వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు శ్రీవారి సాలకట్ల సాక్షాత్కార వైభవోత్సవాలు సాగనున్న నేపథ్యంలో ముందుగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలో మంగళవారం వేకువజామునే స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగశ్రవణం నిర్వహించనున్నారు. అనంతరం ఉదయం 6 నుంచి 11.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిపించనున్నారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితరాలను పవిత్రజలాలతో శుద్ధి చేయనున్నారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలతో ఆలయ ప్రోక్షణం చేపట్టనున్నారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి భక్తులను శ్రీవారి దర్శనానికి అనుమతించనున్నారు.

ముగిసిన మహాభారత యజ్ఞం



దుర్యోధన భీమ వేషధారుల యుద్ధ సన్నివేశం

వెదురుకుప్పం: మండలంలోని చెంచుగుడి సమీపంలో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో గత 10 రోజులుగా జరుగుతున్న మహాభారత యజ్ఞం ఆదివారం దుర్యోధన వధ కార్యక్రమంతో ముగిసింది. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. తదుపరి భాగవతారిణి హరికథ కాలక్షేపం జరిగింది. మధ్యాహ్నం దుర్యోధన వధ ఘట్టాన్ని కళాకారులు రక్తికట్టించారు. ముందుగా గంగమడుగులో దాక్కొని ఉన్న దుర్యోధనుడిని భీమసేనుడు లాక్కొచ్చి చేసే యుద్ధ సన్నివేశం ఆహూతులను అలరించింది. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్యోధనుడి ప్రతిమ వద్ద సాగిన భీమ, దుర్యోధన వేషధారుల భీకర పోరు ఘట్టం భక్తులను కట్టిపడేసింది. ఇద్దరి మధ్య వీరోచితంగా సాగిన ఈ యుద్ధంలో దుర్యోధనుడు తనువు చాలించడంతో ధర్మరాజులకు పట్టాభిషేకం చేశారు. సాయంత్రం అమ్మవారి అగ్నిగుండ ప్రవేశాన్ని భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు కంకణధారులై ఉపవాసాలతో అగ్నిగుండ ప్రవేశం చేసి మొక్కులు తీర్చుకున్నారు.

‘పట్టణ ఆరోగ్యానికి’ అభయం

నాడు

గత టీడీపీ పాలనలో అర్బన్ హెల్త్ సెంటర్లు దిష్టి బొమ్మలను తలపించేవి. సమయానికి తలుపులు తెరుచుకునేవి కావు. డాక్టర్లు ఉండరు...సిబ్బంది రారు.. ఖాళీ పోస్టులు భర్తీ చేయరు.. దీంతో వచ్చే రోగులు తీవ్ర నిరాశతో వెనుదిరిగేవారు. ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించేవారు. అక్కడ వైద్యం కోసం వేలాది రూపాయలు వ్యయం చేసేవారు. వైద్యరంగాన్ని పూర్తిగా విస్మరించడంతో సెంటర్లలో కనీసం మందుబిళ్లలు కూడా దొరికేవి కావు. ఆరోగ్య కేంద్రాల్లో వసతుల కల్పనకు నిధులు మంజూరయ్యేవి కాదు.

నేడు

పట్టణంలో 30 వేల మందికి ఒక ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో చేపట్టిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సత్ఫలితాలు అందిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 14 అర్బన్ హెల్త్ సెంటర్లను నిర్మించి రోగులకు సేవలందిస్తున్నారు. ఒక్కో అర్బన్ హెల్త్ సెంటర్‌కు ప్రభుత్వం రూ.80 లక్షలు కేటాయించగా, కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా తీర్చిదిద్దారు. త్వరలో అన్ని కేంద్రాలకు సొంత భవనాలు అందుబాటులోకి రానున్నాయి. ఇంటి వద్దనే వైద్య సేవలందుతుండడంతో రోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

- మెరుగైన సేవలందిస్తున్న వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్
- గతంలో వసతులు శూన్యం.. నేడు సకల సదుపాయాలు
- సకాలంలో వైద్య సేవలు అందుతున్న వైనం



ప్రారంభోత్సవంలో మంత్రి పెద్దిరెడ్డి అధికారులు, వైద్య బృందం (ఫైల్)

చిత్తూరు రూరల్: జిల్లాలో డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రజల ఆరోగ్య సంరక్షణకు అభయమిస్తున్నాయి. ఈ ఆరోగ్య కేంద్రాలు కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్య సేవలు అందిస్తున్నాయి. దీంతో ప్రాథమిక దశలోనే నగరవాసుల జీవన ప్రమాణాలు మెరుగుపడే దిశగా అడుగులు పడుతున్నాయి. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసినప్పటినుంచి వైద్య, విద్య రంగాలు కొత్తపుంతలు తొక్కుతున్నాయి.

జిల్లాలో 14 డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. ఇందులో మూడు భవనాలు పాతవి కాగా మరో 11 భవనాల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ కొత్త నిర్మాణాల్లో నాలుగు భవనాలు రోగులకు అందుబాటులోకి వచ్చాయి. మిగిలిన 7 భవనాల పనులు పూర్తి దశకు చేరుకుంటున్నాయి. త్వరలో ఈ భవనాలు కూడా ప్రారంభోత్సవం కానున్నాయి. ఈ కేంద్రాల ద్వారా ప్రభుత్వం రోగులకు మెరుగైన వైద్య సేవలందిస్తోంది.

సిబ్బంది ఇలా

కేంద్రాల్లో వైద్య సేవలను పూర్తి స్థాయిలో అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ముందుగా ఖాళీలను భర్తీ చేస్తూ, సేవలను మెరుగుపరుస్తోంది. మెడికల్ ఆఫీసర్, స్టాఫ్ నర్సులు ఇద్దరు, ఫార్మాసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, డీఈఓ, ఎల్ జీఎస్సీ సిబ్బంది, వాచ్‌మెన్లను నియమించారు. వారంలో మూడు రోజులు స్పెషాలిటీ డాక్టర్ అందుబాటులో ఉంటారు.

64 రకాల వైద్య సేవలు

సెంటర్ ఈ ఆస్పత్రుల్లో ప్రాథమికంగా షుగర్, బీపీ, జ్వరాలు, వాంతులు, విరేచనాలకు పలు రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నారు. 64 రకాల వైద్య సేవలతోపాటు 172 రకాల మందులు లభిస్తాయి. ఒక్కో ఆస్పత్రికి రోజుకు సరాసరి 30 నుంచి 50మంది రోగులు వస్తున్నారు. సేవలు పెరగడంతో రోగులు ఆస్పత్రికి క్యూకడుతున్నారు.

వైద్య సేవల్లో మార్పులు



ప్రభుత్వం వైద్య సేవల్లో మార్పులు తీసుకొస్తోంది. అన్ని సదుపాయాలు కల్పిస్తోంది. కొత్తగా నాలుగు భవనాలు ప్రారంభించాం. త్వరలో మిగిలినవి కూడా ప్రారంభమవుతాయి. ఖాళీ పోస్టుల భర్తీలో కూడా లోటుపాట్లు లేవు. నిర్ణీత సమయంలో వైద్య సేవలు అందేలా చూస్తున్నాం. మందులు, మాత్రలు అందుబాటులో ఉన్నాయి. ఓపీల సంఖ్య పెరుగుతోంది.

–హర్షవర్ధన్, డీపీఎంఓ, చిత్తూరు



పుంగనూరు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరంభమైన వైద్య సేవలు



అర్బన్ హెల్త్ సెంటర్

కిటకిటలాడిన బోయకొండ



ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మతల్లి దీవెనలకోసం భక్తులు బోయకొండకు ఆదివారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆషాఢమాసం రాకతోపాటు అమావాస్య కావడంతో గంగమ్మ ఆలయంలో భక్తుల రద్దీ గణనీయంగా పెరిగింది. క్యూలన్నీ కిక్కిరిసిపోయాయి. బోయకొండలో ఎటుచూసినా జన సంద్రంగా మారింది. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలనుంచి వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం వివిధ వాహనాల్లో తరలివచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అర్చకులచే అమ్మవారి ఉత్సవ మూర్తి ఎదుట అమావాస్యను పురస్కరించుకొని పూజలు చేశారు. అమ్మవారి దర్శనం కోసం క్యూలలో భక్తులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. కోరిన కోర్కెలు తీరిన భక్తులు పిండి, నూనెదీపాలు, దీవెలతో మేళతాళాల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రమౌళి ఆధ్వర్యంలో అమ్మవారి తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. సీఐ మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐ రవికుమార్ నిఘా ఏర్పాటు చేసి ఎలాంటి ఘటనలు తలెత్తకుండా చర్యలు చేపట్టారు.



బోయకొండ ఆలయంలో భక్తుల రద్దీ

ఆటో బోల్తా.. వ్యక్తి దుర్మరణం

పొదలకూరు: పట్టణంలోని రామనగర్‌గేటు సెంటర్‌లో ఆదివారం ఆటో బోల్తా పడిన ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. తిరుపతి జిల్లా గూడూరు రూరల్ మండలం ఇందూరుకండ్రిగ గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఆటోలో కలువాయి మండలం చింతలాత్మకూరు గ్రామానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఆటోలో ఉన్న వ్యక్తులు పట్టణంలోని గేటుసెంటర్‌లో కూల్‌డ్రింక్స్ తాగి మనుబోలు మార్గంలో వెళ్తున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో చిల్లకూరు గిరి (42)పై ఆటో పడడంతో మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై ఎస్‌కే కరిముల్లా ఘటనా స్థలానికి చేరుకుని దగ్గరలోనే ఉన్న సీహెచ్‌సీకి గిరిని తరలించాడు. అయితే అప్పటికే అతడు మృతిచెందాడు. ఆటో డ్రైవర్, మరో వ్యక్తి భయపడి పరారైనట్లుగా చెబుతున్నారు. ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

8 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

నాయుడుపేటటౌన్: మండలంలోని రామారెడ్డికండ్రిగ ఎస్సీ కాలనీ సమీపంలో జరుగుతున్న పేకాట స్థావరంపై ఆదివారం పోలీసులు దాడులు చేసి, 8 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. పేకాట జరుగుతున్నట్లు సమాచారం అందడంతో సీఐ నరసింహారావు సారథ్యంలో ఎస్‌ఐ శ్రీకాంత్ సిబ్బందితో రామారెడ్డికండ్రిగలో పేకాట స్థావరంపై దాడులు జరిపారు. అక్కడ పేకాడుతున్న 8 మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.1800 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అద్దాల మండపం..వరసిద్ధుని క్షేత్రం

స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి అద్దాల మండపం ఒక మణిహారం కానుంది. వరసిద్ధుని పుణ్యక్షేత్రం అంచెలంచెలుగా దినదినాభివృద్ధి చెందుతోంది. గత సంవత్సరం దాతల సహకారంతో ఆలయాన్ని సుందరంగా పునర్నిర్మించారు. తరువాత ఆలయం లోపల ఉన్న అద్దాల మండపం తొలగించి రాతితో నిర్మిస్తున్నారు. ఆలయం లోపల ఉన్న ఆంజనేయ స్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులు చేపట్టారు. అందులో భాగంగా అదే స్థానంలో నూతనంగా రాతితో నిర్మించనున్నారు. త్వరలో ఆలయం పునర్నిర్మాణం చేసి సంవత్సరం కావడంతో లఘు కుంభాభిషేకం నిర్వహించడానికి అధికారులు సన్నద్ధమవుతున్నారు.

- అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతున్న కాణిపాకం
- రూ.11 కోట్లతో ఆలయ పునర్నిర్మాణం
- త్వరలో ప్రధాన ఆలయానికి లఘు కుంభాభిషేకం


కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో నిర్మిస్తున్న అద్దాల మండపం

కాణిపాకం (యాదమరి): జిల్లాలోని ఐరాల మండలం కాణిపాకంలో స్వయంభుగా వెలిసిన కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి సత్యప్రమాణాల దేవుడిగా విరాజిల్లుతున్నారు. స్వామివారి దర్శనానికి భక్తులు వంద నుంచి వేల సంఖ్యలో తరలివస్తున్నారు. భక్తుల సంఖ్యకు పలు ఇబ్బందులు ఎదురవుతుండడంతో ఆలయ పాలక మండలి చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ బాబు చొరవతో ఎన్‌ఆర్‌ఐల సహాయంతో రూ.11 కోట్లు వెచ్చించి ఆలయ పునర్నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేశారు. నూతనంగా ఆలయ గోడలపై శిల్పకళ ఉట్టిపడేలా బహు సుందరంగా నిర్మించారు. ఈ ఆలయ పనులు పూర్తి చేసి గత ఏడాది ఆగస్టు 21న అంగరంగ వైభవంగా ప్రధాన ఆలయానికి మహా కుంభాభిషేకం నిర్వహించారు. దీంతో ప్రస్తుతం స్వామివారిని దర్శించుకోవడానికి రోజు 15 వేల నుంచి 20 వేల మందికి పైగా తరలి వస్తున్నారు. వారికి అనుగుణంగా ఆలయ పాలక మండలి, అధికారులు ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేసి ఎటువంటి ఇబ్బందులు లేకుండ స్వామివారి దర్శనం కల్పిస్తున్నారు.

దాతల సాయంతో పునర్నిర్మాణం

దాతల సాయంతో గతంలో ప్రధాన ఆలయంలో ఉన్న అద్దాల మండపాన్ని తొలగించి అదే స్థానంలో రూ.కోటి వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్నారు. పనులు పూర్తి కాగానే సిద్ధి, బుద్ధి, సమేత వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలను అందులో కొలువు తీర్చనున్నారు. మూలవిరాట్ దర్శనం చేసుకున్న భక్తులు బయటకు రాగానే అద్దాల మండపంలో ఉన్న ఉత్సవమూర్తులను దర్శించుకోవడానికి వీలుగా నిర్మిస్తున్నారు. ఆలయం ఆవరణలోని ఆంజనేయ స్వామి ఆలయ జీర్ణోద్ధరణకు శ్రీకారం చుట్టారు.

త్వరలో మహా ప్రాకార నిర్మాణం

వినాయక స్వామి ఆలయంతోపాటు స్వామివారి అనుబంధ ఆలయాలైన శ్రీ మణికంఠేశ్వర స్వామి, శ్రీ వరదరాజుల స్వామి ఆలయాలను కలుపుతూ మహా ప్రాకారాన్ని రూ.50 కోట్లతో నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు. దీనిపై నివేదికలను రాష్ట్ర దేవదాయ శాఖ అధికారులకు కాణిపాకం ఆలయ అధికారులు పంపారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే పనులు ప్రారంభించనున్నారు. పనులు పూర్తయితే రాష్ట్రంలోనే గాక దేశంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రం కానుంది. ఆలయ పునర్నిర్మాణం పూర్తయి సంవత్సరం రోజులు కావడంతో లఘు కుంభాభిషేకం నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

మరిన్ని అభివృద్ధి పనులు



ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో భక్తుల సౌకర్యార్థం మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతాం. ఆలయం లోపల భక్తులకు భక్తి భావన కలిగిలే శిల్పకళా సౌందర్యంతో నిర్మించాం. ఆలయంలో అద్దాల మండపం పనులు జరుగుతున్నాయి. త్వరలో మహాప్రాకారం పనులు ప్రారంభిస్తాం. నిత్యఅన్నదాన సత్రాలు నూతనంగా నిర్మించి రోజు 7 వేల మందికి పైగా భక్తులు అన్నప్రసాదం స్వీకరించేలా ఏర్పాట్లు చేస్తున్నాము. కాణిపాకం ఆలయాభివృద్ధికి ప్రభుత్వ యంత్రాంగం నుంచి అన్ని రకాల సహకారం అందుతోంది. దాతలు తక్షణమే స్పందిస్తున్నందున అభివృద్ధి వేగంగా సాగుతోంది.

- మోహన్ రెడ్డి, ఆలయ చైర్మన్, కాణిపాకం

అందరి సహకారంతో అభివృద్ధి



జిల్లాలోనే ఏకైక ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయం. దీన్ని దేశంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం. ఇక్కడి పాలయకులు, అధికారుల సమన్వయంతో, అందరి సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తాం. ఆలయానికి తిరుమల తరువాత ఏ ఆలయానికి అందుబాటులో లేని స్వర్ణ రథాన్ని కాణిపాకానికి తీసుకొచ్చాం. స్వామివారికి నిత్యం 15 రకాల సేవల వరకు నిర్వహిస్తున్నాం. భక్తుల సౌకర్యార్థం అదనపు గదులు, సత్రాలు ఏర్పాటు చేస్తున్నాం. మరింత అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాం.

- వెంకటేశు, ఆలయ ఈఓ, కాణిపాకం


చిత్తూరు బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,500
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.74,000
రిటైల్ వెండి గ్రాము	రూ.76

మద్యం మత్తులో వీరంగం


పగిలిన మెడికల్ షాప్ అద్దాలు

శ్రీరంగరాజపురం : మండల కేంద్రంలోని మద్యం షాప్ ఎదురుగా పాతపాల్యం గ్రామానికి చెందిన రాజేష్, రవి, అతనితో పాటు కొంతమంది మద్యం సేవించి చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై వీరంగం సృష్టించారు. రహదారిపై వెళ్లేవారిని భయాందోళనకు గురి చేశారు. వైన్ షాప్ ఎదురుగా పలు కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఆర్టీసీ బస్సు డ్రైవర్ చక్రవర్తి కుటుంబం కూడా అక్కడే నివాసం ఉంటోంది. వారి ఇంటిలో ఉన్న మహిళలతో మద్యంమత్తులో వారు అసభ్యకరంగా ప్రవర్తించి, రాళ్ల దాడి చేశారు. అంతటితో ఆగకుండా వారి ఇంటిపైకి వచ్చి మూసి ఉన్న తలపులను పగలగొట్టేందుకు ప్రయత్నించారు. రాత్రి సమయంలో మీ అంతు చూస్తాం అని భయపెట్టడంతో మహిళలు భయాందోళన చెందుతున్నారు. అలాగే చికెన్ షాప్ నిర్వహిస్తున్న హేమాద్రిపై దాడి చేసి, చికెన్‌పై మట్టి పోసి, పక్కన ఉన్న మెడికల్ షాప్ అద్దాలను పగులగొట్టారు. నిత్యం మందుబాబులు సాయంత్రం అయితే రహదారి పక్కన, ఇళ్ల మధ్యలో తాగుతూ అలజడి సృష్టిస్తున్నారని, కూతవేటు దూరంలో పోలీసుస్టేషన్ ఉన్నా స్పందించకపోవడం వల్లే ఇదంతా జరుగుతోందని స్థానికులు ఆరోపించారు. వెంటనే పోలీస్ యంత్రాంగం స్పందించి, వారిపై చర్యలు తీసుకోవాలని, వారి బారి నుంచి రక్షణ కల్పించాలని కోరారు.

నెల్లూరులో 23 అంతస్తుల అపార్ట్‌మెంట్ నిర్మాణం


మాట్లాడుతున్న గిలకా నరేంద్ర

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగరంలో మొట్ట మొదట సారిగా 23 అంతస్తుల అపార్ట్‌మెంట్ నిర్మాణాన్ని చేపట్టినట్లు యూనిక్ ప్రాజెక్ట్స్ మేనేజింగ్ పార్టనర్ గిలకా నరేంద్ర వెల్లడించారు. నెల్లూరులోని ముత్తుకూరు రోడ్డు హరనాథపురంలో ఉన్న యూనిక్ ప్రాజెక్ట్స్ సైట్ ఆఫీస్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహా నగరాల్లో నిర్మిస్తున్న విలాసవంతమైన అపార్ట్‌మెంట్లకు ధీటుగా అన్ని సౌకర్యాలతో తాము చేపట్టిన ఈ ప్రాజెక్ట్ నెల్లూరు నగరానికే ఐకాన్‌గా నిలిచిపోనుందన్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో పాతికేళ్లకుపైగా అనుభవంతో, తెలుగు రాష్ట్రాల్లో ఎన్నో వెంచర్లను దిగ్విజయంగా పూర్తి చేసిన తాను మేనేజింగ్ పార్టనర్‌గా యూనిక్ ప్రాజెక్ట్స్ ప్రారంభించానన్నారు. నిర్మాణ రంగంలో నిష్ణాతులైన బృందంతో, సరికొత్త పద్ధతులను అనుసరిస్తూ, నాణ్యతకు పెద్దపీట వేసి అద్భుతమైన ఆకాశ హర్మ్యం 'యూనిక్ స్పైర్' నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. విలాసవంతమైన జీవనశైలి కోరుకునే కుటుంబాలకు అత్యాధునిక గృహాలను అందించడమే లక్ష్యంగా, అంతర్జాతీయ ప్రమాణాలతో, అత్యున్నత సదుపాయాలతో 23 అంతస్తుల నిర్మాణాన్ని చేపట్టామన్నారు. నాలుగు బెడ్‌రూములతో 4,311 నుంచి 4,770 చదరపు అడుగుల వైశాల్యంతో విశాలమైన 80 అపార్టుమెంట్లు నిర్మించడం జరుగుతోందన్నారు. స్విమ్మింగ్ పూల్, బ్యాడ్మింటన్ కోర్టు, జిమ్, స్పా, యోగా, మెడిటేషన్ హాల్, బ్యాంకేట్ హాల్, మల్టీపర్పస్ హాల్ వంటి ఇండోర్ సదుపాయాలతో ల్యాండ్ స్కేప్డ్ గార్డెన్స్, క్రికెట్ ప్రాక్టీస్ నెట్, టెన్నీస్ కోర్ట్, జాగింగ్ ట్రాక్, చిల్డ్రన్స్ ప్లే ఏరియా, ఎల్డర్స్ సీటింగ్ ప్లాజా తదితర అవుట్‌డోర్ సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ప్రత్యేకంగా కార్లు పార్కింగ్ ఉంటుందని వివరించారు. ఈ ప్రాజెక్టును మూడు సంవత్సరాల్లోపు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

విశ్వసాయి విద్యార్థుల విజయకేతనం


ప్రతిభ చూపిన విద్యార్థులతో విశ్వసాయి యాజమాన్యం

నెల్లూరు(టౌన్): జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో విశ్వసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఆ విద్యాసంస్థల చైర్మన్ సత్యనారాయణ, వైస్ చైర్మన్ కృష్ణమోహన్ తెలిపారు. నెల్లూరు మాగుంటలేవుట్‌లో ఉన్న విశ్వసాయి జూనియర్ కళాశాలలో ఆదివారం ర్యాంకులు సాధించిన విద్యార్థులను వారు అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ స్థాయిలో హృతిక్ 112, ప్రశాంత్ 1,931, తనుశ్రీ 3,315, సిసిర్‌రెడ్డి 3,508, యజ్ఞశ్రీ 892, యువదీప్ 1,521 ర్యాంకులు సాధించారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రేపు స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశానికి విద్యార్థుల ఎంపిక

నాయుడుపేటటౌన్: పట్టణంలో మంగళవారం డాక్టర్ వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్ ఆకాడమిలో ప్రవేశానికి విద్యార్థుల ఎంపిక నిర్వహిస్తున్నట్లు అంతర్జాతీయ పారా క్రీడాకారుడు మోమిడి లక్ష్మయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాయుడుపేట, సూళ్లూరుపేట, పెళ్లకూరు, ఓజిలి మండలాల్లో 4, 5 తరగతులు చదివే పిల్లలకు వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్ ఆకాడమీ చేరేందుకు ఎంపికలు చేస్తామన్నారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగే ఎంపికలకు మంగళవారం ఉదయం 8 గంటలకు హాజరుకావాలన్నారు. ఎంపికల వచ్చే విద్యార్థులు జనన ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకురావాలన్నారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు 26 తేదీన తిరుపతిలో జరిగే జిల్లాస్థాయి ఎంపికలకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 94405 51278 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

29న చందనాలంకరణ

రాపూరు: మండలంలోని పెంచలకోనలో ఉన్న పెనుశిల లక్ష్మీనరసింహస్వామివారికి ఈ నెల 29వ తేదీన చందనాలంకరణ సేవ నిర్వహించనున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. ఆ రోజు స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా స్వామివారికి ఉదయం 4గంటలకు సుప్రభాతం, 9 గంటలకు శాంతిహోమం, 10గంటలకు కల్యాణం, రాత్రి 7 గంటలకు బంగారు గరుడసేవ నిర్వహించనున్నట్లు తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


ర్యాలీ నిర్వహిస్తున్న యోగా గురువులు

తిరుపతి కల్చరల్ : సర్వరోగ నివారిణిగా వర్ధిల్లుతున్న యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని యోగా గురువులు పిలుపు నిచ్చారు. ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం తిరుపతి పతంజలి యోగ సమితి, భారత స్వాభిమాన్ ట్రస్ట్, ప్రకాశం పార్క్ వాకర్స్ అసోసియేషన్, సంకల్ప ఆస్పత్రి, ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రకాశం పార్క్ నుంచి ప్రారంభమైన ర్యాలీ లీలామహల్ సర్కిల్, తుడా రోడ్డు, సుందరయ్య నగర్ మీదుగా మళ్లీ ప్రకాశం పార్క్‌కు చేరకుంది. ఈ సందర్భంగా ఆరోగ్యమే మహాభాగ్యం, యోగా చేయండి ఆరోగ్యంగా జీవించండి అంటూ యోగా గురువులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో పతంజలి యోగా సమితి జిల్లా అధ్యక్షుడు కైలాస్ సింగ్ రాజ్ పురోహిత్, భారత స్వాభిమానం ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు ఓటేరు కృష్ణ, వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి జగన్నాథం, సంకల్ప హాస్పిటల్ కార్యదర్శి సోమేశ్వర్, డాక్టర్ కిషోర్, యోగా గురువులు ప్రభాకర్, తంగరాజు, హరి, రాధిక, ఉమా, రాధా, చంద్రమౌళి పాల్గొన్నారు.

రాత్రంతా బురద గుంతలోనే..


యువకులను బయటకు తీసిన స్థానికులు

గూడూరు : జాతీయ రహదారి పక్కనే ఉన్న గుంతలో శనివారం రాత్రి ఇద్దరు యువకులు పడిపోయారు. బురదలో గొంతు వరకు కూరుకుపోయిన వారిని ఆదివారం ఉదయం స్థానికులు గుర్తించి వెలికితీశారు. వివరాలు.. గూడూరు ఇందిరా నగర్‌కు చెందిన వంశీ, మైఖేల్ వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై చిల్లకూరుకు బయలుదేరారు. మార్గం మధ్యలో హోండా షోరూమ్ వద్ద బైక్ అదుపు తప్పడంతో పక్కనే గ్యాస్ పైప్‌లైన్ కోసం తీసిన గుంతలో పడిపోయారు. ఇటీవల కురిసిన వర్షాలకు గుంత బురదమయంగా మారడంతో అందులో బైక్‌తో సహా చిక్కుకుపోయారు. రాత్రంతా ఆ మార్గంలో ఎవరూ రాకపోవడంతో అలాగే ఉండిపోయారు. ఉదయం ఆ దారిలో వెళుతున్న వారు గుంతలో పడిన యువకులను గుర్తించి బయటకు తీశారు. అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయిన బాధితుల పరిస్థితి విషమంగా ఉండడంతో 108లో మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ఆస్పత్రికి తరలించారు.

కాయకష్టం..కన్నీటి నృత్యం!

- ప్రముఖ కొరియోగ్రాఫర్ రాకేష్ మాస్టర్ కన్నుమూత
- కన్నీరుమున్నీరైన కుటుంబీకులు

తిరుపతి కల్చరల్: 'జీవితంలో రాణించాలంటే పట్టుదల ఉండాలి. సడలని సంకల్పంతో ముందుకు సాగాలి. అవరోధాలు ఎదురైనా..కష్టాలు వెంటాడుతున్నా పట్టువదలని విక్రమార్కుడిలా పోరాడాలి. విజయం చేకూరేవరకు కష్టాలు..కన్నీళ్లు దిగమింగుతూనే ఉండాలి' అంటాడు ప్రముఖ కొరియోగ్రాఫర్ రాకేష్ మాస్టర్. అచ్చం ఆయన జీవితం అలాగే కొనసాగిందని తన బంధువులు చెప్పుకొస్తున్నారు. సినిమా రంగంలో వందలాది చిత్రాలకు కొరియోగ్రాఫర్‌గా పనిచేసిన రాకేష్ మాస్టర్ ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌లో అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషాద వార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఆయన జ్ఞాపకాలు తలుచుకుని స్నేహితులు, బంధువులు కన్నీటిపర్యంతమయ్యారు.

రాకేష్ మాస్టర్‌ది తిరుపతే

రాకేష్‌మాస్టర్ తిరుపతిలోని బండ్ల వీధిలో 1960లో జన్మించారు. ఆయనకు పద్మావతి, అరుణ, విజయ, లక్ష్మి అనే సోదరిలతోపాటు అన్న కోటేశ్వరరావు, తమ్ముడు కృష్ణారావు ఉన్నారు. వీరు ప్రస్తుతం డీఆర్ మహల్ రోడ్డులోని ఎస్బీఐ కాలనీలో నివాసముంటున్నారు.


రాకేష్ మాస్టర్ (ఫైల్)

బ్రూస్‌లీ స్ఫూర్తి

హాలీవుడ్ నటుడు బ్రూస్‌లీ అంటే రాకేష్‌మాస్టర్‌కు ఇష్టం. ఆయన స్ఫూర్తితో కరాటే, జిమ్నాస్టిక్ నేర్చుకున్నారు. తిరుపతిలో అనేక నృత్య ప్రదర్శనలు చేశారు. తన ఆకాంక్ష నేరవేర్చుకోవాలనే తపనతో 1996లో చెన్నైకి వెళ్లి సినీ రంగంలో చేరే ప్రయత్నం చేశారు. ప్రయత్నాలు విఫలం కావడంతో తిరిగి తిరుపతికి చేరుకొని ఎస్వీ సంగీత, నృత్య కళాశాలలో భరతనాట్యం అభ్యసించారు. మిత్రుల ప్రోత్సాహంతో మళ్లీ హైదరాబాద్‌కు వెళ్లి సినిమాల్లో డ్యాన్స్ మాస్టర్‌గా స్థిరపడ్డారు. సుమారు 350 సినిమాలకుపైగా పనిచేశారు. ప్రముఖ కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ సైతం ఈయన శిష్యుడే కావడం విశేషం.